# అద్దె ఇంట్లో
# కొత్తబ్బాయ్

(అతన్ని ఎవరూ పడగొట్టలేరు)



N.S. నాగిరెడ్డి

# అద్దె ఇంట్లో కొత్తబ్బాయ్

( అతన్ని ఎవరూ

పడగొట్టలేరు)

## ఎన్.ఎస్. నాగిరెడ్డి

సెల్ : 888 5740346

బ్రిలియంట్ బుక్స్

గులాబితోట, విజయవాడ - 3

**ADDE INTLO KOTTHABBAY**

By

**N.S.NAGI REDDY**
Gulabithota, Vijayawada - 520 003

© All Rights Reserved by Author

E-Books

First Edition : **2013**

Price :
**Rs. 80-00**

Cover Design :
**DURGA RAO**

Printed by :
For Copies :
**BRILLIANT BOOKS**
Gulabhi Thota, Vijayawada - 3
Cell No. 888 5740 346

# అద్దె ఇంట్లో కొత్తబ్బాయ్

అదో పెద్ద మండువా లోగిలి. పట్టణాల్లో, ముఖ్యంగా నగరాల్లో మచ్చుకైనా కానరాని మండువా లోగిలిని ఆ నగరంలో గోల్‌మాల్ పేటలో చూసిన వాళ్ళెవరయినా ఆశ్చర్యపోక తప్పదు.

ఎనిమిది వాటాలున్న ఆ ఇంటిమీద పెంకు మాత్రం ఇటీవలే  తిరగేసినట్లుగానూ, ఇంటికి రంగులు వేసినట్లుగానూ తెలిసిపోతోంది.

ఆ మండువా లోగిలి చుట్టూ ప్రహరీ గోడ, ఇంటిముందు పెద్ద ఇనుపగేటు, గేటుముందు ఫేము కుర్చీలో కూర్చుని ఉన్నాడు ముప్పై ఏళ్ళ యువకుడు.

అతనే ఆ మండువా లోగిలి యజమాని సదానందం. సాయంకాలం నాలుగు గంటలవేళ అలా గేటుముందు కూర్చుని పడిగాపులు కాయడం హాబీ కాదు కానీ ఇటీవలే ఆ అవసరం ఏర్పడింది.

ఆ అవసరాన్ని తీర్చగల ధీరుడికోసం అతను వారం రోజులుగా, వేళాపాళా

లేకుండా ఆ గేటుముందు కూర్చుని ఎదురు తెన్నులు చూస్తూ వున్నాడు.

అప్పుడే ఆ రోడ్‌లోకి తిరిగాడో యువకుడు. ఎత్తుకు తగ్గ లావుతో అందంగానే ఉన్నాడు. బ్లూ కలర్ పాంట్‌మీద వైట్‌షర్ట్ ఇన్ చేశాడు.

దేనికోసమో వెదుకుతున్నట్లు రోడ్‌కి అటు, ఇటూ ఉన్న ఇళ్ళకేసి చూసుకుంటూ వస్తున్నాడు. అది చూడగానే సదానందంలో ఏ మూలనో ఆశ రేకెత్తింది.

హడావుడిగా లాల్చీ జేబులోంచి సిగరెట్ తీసి, వెలిగించుకున్నాడు. ఆ వస్తున్న వైట్ షర్ట్‌నే చూస్తూ చక చక దమ్ము లాగుతున్నాడు సదానందం.

ఆ వైట్ షర్ట్ యధాలాపంగా మండువా లోగిలి కేసి ఓ చూపు విసిరి ముందుకు పోబోయాడు. సదానందం ఇక తట్టుకోలేక పోయాడు.

గేటుకి ఇవతలనుంచే "ఇదుగో వైట్ షర్టూ!" అంటూ పెద్దగా పిలిచాడు సదానందం.

ఆ పిలుపుకి శరాఘాతం తగిలిన పక్షిలా తల తిప్పి గేటుకేసి చూశాడా యువకుడు. గేటు అవతల ఉన్న సదానందం జేబు దొంగతనానికి కటకటాల వెనుక కూర్చున్న ఖైదీ నెంబరు 420లా కనిపించాడు.

"గుడ్లగూబలా ఆ చూపులేమిటి? పిలుస్తోంది నిన్నేనోయ్, వైట్ షర్ట్!" చెప్పాడు సదానందం.

ఆ యువకుడికి కొంచెం కోపం తన్నుకొచ్చినట్లుంది. రోషంతో ముక్కుపుటాలు పొంగాయి.

"వైట్ షర్ట్ ఏమిటి, మర్యాద లేకుండా? నాకో పేరుందని తెలియదూ!" అన్నాడు చిటపటలాడిపోతూ.

"పేరుందట... బోడి పేరు... వీడొక్కడికే ఉందండి పేరు. అక్కడికి మనకెవరికి లేనట్లు." అన్నాడు సదానందం అక్కడ ఇంకా ఎవరో ఉన్నట్లు జనాంతికంగా.

ఆ యువకుడికి తన ముందున్నదెవరో క్రాక్‌లా అనిపించింది. తను బుద్ధి తక్కువై అటు చూశాడనిపించింది. తల తిప్పుకుని తన దారిన తాను

పోబోయాడు.

"ఆగు....ఆగక్కడ. ఏమిటా దూకుడు? పిలుస్తుంటే మంచీ, మర్యాద లేకుండా..." అన్నాడు సదానందం కోపంగా.

"ఆ రెండూ మాకున్నాయ్ లేవయ్యా! ఎలా పిలవాలో తెలియని నువ్వు మర్యాద గురించి మాట్లాడుతున్నావా?" అన్నాడా యువకుడు కోపంగా గేటు దగ్గరకొచ్చి.

"ఓసి నీ కోపం కుక్కలు తోలా? అందుకటయ్యా.అది సరే... ఎందుకలా దిక్కులు చూసుకుంటూ పోతున్నావ్?" అన్నాడు సదానందం నవ్వుతూ.

"అద్దెకొంప కోసం... నాఖర్మ కాలి ఈ రోడ్‌మీదకు తగలడ్డాను." అన్నాడతను విసుగ్గా.

"బాగుందోయ్. అద్దె ఇల్లు కోసమా?అలా అడగకుండా పోతుంటే నీకు ఇల్లు ఎక్కడ దొరుకుతుందోయ్. ఎవర్నయినా అడిగితే చెబుతారు గానీ..."

"పోర్షన్ ఖాళీగా ఉంటే 'టూలెట్' బోర్డు పెడతారు కదా...?"

"ఎంత అమాయకుడివోయ్, సింగినాదం!"

"నా పేరు సింగినాదం కాదు. దినేష్!" అన్నాడా యువకుడు తిరిగి కోపం తెచ్చుకుంటూ–

"పేరులో ఏముందోయ్ గుర్నాథం! దినేష్ కాకపోతే హరీష్ అనుకుందాం. నష్టం ఏమీ లేదుగా. ఆఁ....ఏం చెబుతున్నాను. టూలెట్ బోర్డుల గురించి కదూ! పెట్టరు. ఈఇంట్లో ఖాళీ పోర్షన్లున్నా టూలెట్ బోర్డ్ పెట్టరు."

"ఈ ఇంట్లోనా? ఎందుకు పెట్టరు?" ఆశ్చర్యంగా అడిగాడు దినేష్.

"దానికో ఎఫ్.బి. వుందిలే! వదిలెయ్. దాన్నొదిలేయ్. ఇప్పుడు నీకేమిటి కావాలన్నావ్?"

"అద్దెకో ఇల్లు కావాలి సర్! గదయినా ఎడ్జస్ట్ అయిపోతాను సర్!" అన్నాడు దినేష్ సదానందం పట్ల అమాంతం భక్తి శ్రద్దలు అరువు తెచ్చేసు కుంటూ.

"ఎడ్జస్ట్ అయిపోవడానికి అదేమయినా తాళికట్టిన పెళ్ళామటోయ్, జీవితాంతం ఎడ్జస్ట్ అయిపోవడానికి. అద్దె కొంపయ్యా. అద్దెకొంప. ఇష్టం లేకపోతే

తక్షణం ఖాళీచేసి మరో కొంప చూసుకుంటాం. ఏమంటావ్!"

"నిజమేననుకోండి! కానీ బాచ్‌లర్స్‌కి అలాంటి ఛాన్స్‌లు తక్కువ సార్. అద్దెకు కొంప దొరకడమే అబ్బురం."

"ఓహో! నువ్వు బ్రహ్మచారివన్న మాట!" అన్నాడు సదానందం సాలోచనగా.

"వట్టి బ్రహ్మచారిని కాదండి. ఆజన్మ బ్రహ్మచారిగా ఉండాలన్నది నా కోరికండీ!"

"నిజమా? వెరీగుడ్! ఇంతకీ నీకేం కావాలన్నావ్?"

"ఇల్లు సార్. చిన్న గది అయినా సరేసర్. ఇక్కడ దొరుకుతుందంటారా?" తిరిగి వినయం ఆవహించగా కుదించుకుపోతూ అడిగాడు దినేష్.

"దొరుకుతుందా ఏమిటోయ్...? ఈ గోల్‌మాల్ పేటలో ఇక్కడ తప్ప ఇంకెక్కడా ఇల్లు దొరకదోయ్." అన్నాడు సదానందం ధీమాగా.

"అలాగా, సర్! ఇంటి ఓనర్‌గారు ఎవరు సర్- ఎక్కడుంటారు సర్?"

"ఏమిటా వెధవ ప్రశ్న! చెట్టంత మనిషిని ఎదురుగా పెట్టుకుని, ఎవరు, ఎక్కడుంటారు అని చచ్చుప్రశ్నలు వేస్తావటోయ్ సర్వారావ్! నీకు నేను ఇల్లు ఇవ్వను. ఫో...." అన్నాడు సదానందం వెనక్కి తిరుగుతూ.

ఆ దెబ్బతో దినేష్ పూర్తిగా కుదించుకుపోయి వామనుడై పోయాడు. "సార్...." అంటూ దీనంగా పిలిచాడు దినేష్.

వెనక్కి తిరిగిన సదానందానికి దినేష్ ఎక్కడా కనిపించలేదు. కంగారుగా అటూ, ఇటూ చూస్తుంటే క్రిందనుంచి "సార్, ఇక్కడ!" అంటూ మెల్లగా వినిపించింది.

సదానందం కంగారుగా క్రిందకు చూశాడు. అతని ముందు అడుగు అంత పొడవున ఉన్నాడు దినేష్.

"ఇదేమిటోయ్, ఇలా అయిపోయావ్!" అన్నాడు సదానందం జాలిగా.

"వినయం సర్. మీమీద భక్తి శ్రద్ధలు ఎక్కువయిపోయి ఇలా

అయిపోయాను సర్!"

"నో...నో...! అలాంటివేమీ ఓవర్ డోస్‌లో చూపించక్కర్లేదు. మామూలుగా తయారవ్వు."

దినేష్ తిరిగి ఎప్పటిలా అయిపోయాడు.

"శెభాష్! నాకు నువ్విప్పుడు నచ్చావోయ్ హర్నాథం. ఇంక కథలోకి వద్దాం. మా ఇంట్లో బ్రహ్మాండమయిన పోర్షన్ ఉందోయ్. అట్లాంటిట్లాంటి అల్లాటప్పా పోర్షన్ కాదోయ్. క్లాస్ వన్ పోర్షన్. ఈ ఏరియాలోనే కాదు, ఈ సిటీ మొత్తంలోనే అలాంటి పోర్షన్ వేయి రూపాయల కంటే తక్కువ అద్దెకి ఎవరూ ఇవ్వరు!"

దినేష్ గుండె గుభేల్‌మంది. బ్రహ్మచారి సన్యాసి. తనొక్కడూ వెయ్యిరూపాయలిచ్చి ఆ కొంపనేం చేసుకుంటాడు. నీరసం ముంచుకొచ్చేసింది.

"కానీ, నీకు అయిదువందలకే యివ్వడానికి నిశ్చయించుకున్నానోయ్."

"చాలా థాంక్స్ సర్!"

"కానీ కొన్ని కండీషన్లు ఉన్నాయోయ్!"

"ఏమిటి సార్, ఆ కండిషన్‌లు?" తిరిగి వామన అవతారం ఎత్తబోతూ అంతలోనే సదానందానికి కోపం వస్తుందని గ్రహించి ఆగిపోయాడు.

"అన్నీ వీధిలోనే మాట్లాడుకోవడం పెద్దమనుషుల లక్షణం కాదోయ్. అలా గేటు తెరుచుకుని లోపలకు రావోయ్!" అన్నాడు సదానందం గేటు తెరుస్తూ.

దినేష్ తెరిచిన గేటులోంచి లోపలకు వెళ్ళాడు. "రావోయ్ రామరాజూ! అలా అరుగుమీద కూర్చుని మాట్లాడుకుందాం."

ఇద్దరూ అరుగుమీద కూర్చున్నాక "నీకు సిగరెట్ అలవాటు వుంద టోయ్?" అని అడిగాడు సదానందం.

"లేదు సర్!"

"దురదృష్టవంతుడివోయ్! ఈ కాలం కుర్రాళ్ళలో ఆ అలవాటు లేనివాళ్ళే కరువోయ్. నిక్కర్లూ, లిక్కర్లూ, సిగరెట్లు ఒకేసారి కుర్రాళ్ళ జీవితంలో ప్రవేశిస్తున్నాయోయ్!"

"ఆ కండిషన్‌లు ఏమిటో చెప్పండి సార్!"

"అదేనోయ్....ఏ ఇంటి ఓనర్‌కైనా అద్దెకుండేవాళ్ళని తనకిష్టమొచ్చినప్పుడు ఖాళీ చేయమనే హక్కు, అద్దెకుండేవాళ్ళకి కావలసినప్పుడు ఖాళీచేసే హక్కూ వుంటాయిగా?"

"ఉంటాయి సర్!"

"అవునా! అదే నేను చెప్పొచ్చేది. నేను చాలా నిరాడంబర జీవినోయ్! అద్దెకు వుండేవాళ్ళ కష్టాలను నా కష్టాలుగా భావించి బాధపడే జాలిగుండెనాది. అందుకే నా ఇంట్లో అద్దెకుండేవాళ్ళకు కొన్ని రైట్స్ యివ్వాలన్నది నా ఉదార హృదయంలో మెదిలి, మొలకెత్తిన ఓ అభ్యుదయ ఆశయం."

దినేష్‌కి సదానందం ఏం చెబుతున్నాడో అర్థం కాలేదు. "అదికాదు సర్!"

"ఏమిటంటే... ఈ కొంప నాదయినా అద్దెకుండేవాళ్ళని వెళ్ళమనే హక్కు నాకు లేదు. ఒకవేళ ఎప్పుడయినా నాకు తిక్కరేగి ఖాళీ చేయమనే ప్రమాదం వుంది. అందుకే నువ్వు నా ఇంట్లో చేరేముందు చెబుతున్నాను. నేను నిన్ను ఖాళీ చేయమనే హక్కు నాకు లేదు. ఒకవేళ ఖాళీ చేయమన్నా, పదివేల రూపాయలు నీకు ఇచ్చుకోవాలన్నమాట. కండిషన్ ఎలా వుంది?" కాలువూపుతూ అడిగాడు సదానందం.

"వండర్‌ఫుల్! చాలా అద్భుతంగా వుందండి." అన్నాడు దినేష్ ఆనందంతో పొంగిపోతూ.

ఆ క్షణంలో సదానందం అతని కనుల ముందు భగవంతుడిలా గోచరించాడు. నిజంగా ఎంత గొప్ప వ్యక్తి కాకపోతే అద్దెకుండేవాళ్ళపట్ల అంత ఉదారంగా వ్యవహరిస్తాడు.

"ఉందా? ఉండకేం చస్తుంది?భేషుగ్గా ఉంటుంది. దీనికి తోడు మరో చిన్న కండీషన్‌కూడా వుందోయ్!" అన్నాడు సదానందం తాపీగా.

"శెలవియ్యండి సర్, అదేమిటో?" అన్నాడు దినేష్ ముకుళిత హస్తాలతో.

"ఆс...ఏంలేదోయ్! నేను ఖాళీ చేయమంటే మీకు పదివేలు ఎలా

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1415](http://kinige.com/kbook.php?id=1415)**

* * *

**Read other books of N. S. Nagireddy @**

**[http://kinige.com/kbrowse.php?via=author&name=N.S.+Nagi+Reddy&id=224](http://kinige.com/kbrowse.php?via=author&name=N.S.+Nagi+Reddy&id=224)**